క్లుప్తంగా

గూడెంలో హనుమాన్ భక్తుల మాలాధారణ


మాలాధారణ గావిస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పలువురు భక్తులు హనుమాన్ దీక్షా మాలాధారణ గావించారు. మొత్తం 500 మంది భక్తులు మాలాధారణ చేసుకున్నట్లు అర్చకులు తెలిపారు. మాలాధారణ అనంతరం స్వాములు గుట్టపైన గల సత్యదేవున్ని దర్శించుకున్నారు.

నేడు వారసంత వేలం

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో ప్రతి శనివారం నిర్వహించే వారసంత నిర్వహణకు ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: స్థానిక రిమ్స్ డిగ్రీ కళాశాలలో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. కవులు పెద్ది భరత్, సంతోష్, శ్రీనాథ్‌గౌడ్ కవితాగానం వినిపించారు. కార్యక్రమంలో సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

జన్నారం: బీజేపీ మండల నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆసిఫాబాద్ నాయకులు పాల్వాయి హరీశ్‌రావు అన్నారు. మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకెళ్లి వారికి అర్థమయ్యేలా తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సురేష్, అనిల్, కృష్ణ, విద్యాసాగర్, శ్రీకాంత్, ధర్మరాజు, గణేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న గుంట ఐలయ్య

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్‌లో నిర్మించే అక్క మహంకాళి అయ్యల భీరయ్య కామరాతి దేవాలయ నిర్మాణం కోసం గుంట ఐలయ్య లక్ష 25వేల 116రూపాయలు విరాళంగా అందించారు. శనివారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించిన ఐలయ్య ఆలయ నిర్మాణ కమిటీకి సభ్యులైన శ్రీశైలం, రాజయ్య, మొండయ్యకు నగదు అందించగా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఉన్నారు.

నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే..!


శిథిలమైన నర్సాపూర్-ద్వారక రోడ్డు


తారులేచిన మేదరిపేట-కొత్తమామిడిపల్లి రోడ్డు

- గుంతల రోడ్లపై ప్రజల నరకయాతన
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల మరమ్మతులకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా గతేడాది జనవరిలో ఎమ్మెల్యే దివాకర్‌రావు నిధులు మంజూరు చేయించారు. అందులో పలు గ్రామాల బీటీ రోడ్ల రెనివల్స్ కోసం రూ.2.11కోట్లు కేటాయించారు. వీటిని దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ నుంచి తానిమడుగు వరకు, లింగాపూర్ నుంచి గుడిరేవు వరకు, మేదరిపేట నుంచి మామిడిపల్లి, పీడబ్ల్యూ రోడ్ నుంచి కన్నెపల్లి, ధర్మరావ్‌పేట నుంచి పెద్దపేట మీదుగా లక్ష్మీకాంతపూర్, బిక్కనగూడ, కోపెల్లి, అల్లీపూర్ మీదుగా మొకాశిగూడ వరకు, దండేపల్లి నుంచి నర్సాపూర్ మీదుగా ద్వారక వరకు బీటీ రెనివల్ చేసేందుకు గాను వినియోగించనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మరమ్మతుల కింద ముత్యంపేట చెక్‌పోస్ట్ నుంచి రెబ్బనపల్లి వరకు రూ.10లక్షలు కేటాయించారు. ఇందుకు సంబంధించిన నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా, ఇప్పటివరకు పనులు ప్రారంభించక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, నాయకుల పనితీరుపై మండిపడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లపై వెళ్లేందుకు, వాహనదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధికారులు, స్పందించి మరమ్మతు పనులు త్వరగా చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ జిల్లా అధికారి ప్రకాశ్‌ను సంప్రదించగా ఇటీవల టెండర్లు పూర్తయ్యాయి. అగ్రిమెంట్ పూర్తవగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

అడుగడుగున గుంతలే..



రోడ్డు మొత్తం పాడై ఏళ్లు గడుస్తోంది. అడుగడుగునా గుంతలే ఉన్నాయి. దీంతో రోడ్డు గుండా బైకుల మీద, సైకిళ్ల మీద రావాలాన్నా, నడిచి రావాలన్న.. ఇబ్బందే అవుతుంది. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయించాలి.

- దుమల్ల బాపు, నర్సాపూర్

నరకయాతనే..



గుడిరేవు నుంచి లింగాపూర్ రోడ్డు మొత్తం గుంతలమయమైంది. దీంతో రోడ్డు గుండా ప్రయాణం నరకయాతన అవుతోంది. బైక్‌లు, ఆటోల ద్వారా వెళ్లాలంటే వణుకు పుడుతోంది. కిలోమీటర్ల పొడవునా అడుగుకోగుంత ఉండటంతో, ఇబ్బంది అవుతోంది.

- సురేష్, గుడిరేవు

ప్రజల అభివృద్ధి కోసమే పథకాలు

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు


లక్సెట్టిపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: ప్రజల అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయమార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. మహిళల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. రైతుల అభివృద్ధి కోసం రైతుబంధు, రైతు బీమా పథకాలను రైతులు వినియోగించుకుంటున్నారన్నారు. అనంతరం మహిళలకు సలహాలను సూచనలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, పట్టణాధ్యక్షులు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, సురేష్, కల్యాణి, శ్రీకాంత్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 6వ వార్డు గాయత్రి మాత కాలనీలో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.30లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులకు ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ సుంకరి శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, నాయకులు సుంకరి రమేశ్, తోట తిరుపతి, గోగుల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప సత్యాగ్రహ దీక్షకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు


సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: కాంగ్రెస్ అధినాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఆసిఫాబాద్ శివారు ప్రాంతంలో పాదయాత్ర క్యాంపు వద్ద చేపట్టిన సంకల్ప సత్యాగ్రహ దీక్షకు ఆదివారం బెల్లంపల్లి నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. సీఎల్పీ నేత చేపట్టిన దీక్షకు సంఘీభావం ప్రకటించారు. తరలివెళ్లిన వారిలో టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, టీపీసీసీ సభ్యుడు శంకర్, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు స్వామి, మల్లేష్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శారద, బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలాభివృద్ధితో పాటు ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ ఆదరించాలని సూచించారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పద్మ, రైతుబంధు కమిటీ అధ్యక్షులు రాజారాంరెడ్డి, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్, సర్పంచ్ కార్తీక్‌రావు, ఎంపీటీసీ స్వరూపరాణి, నాయకులు గంగాధర్ పలువురు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై గట్ల సుధాకర్

భీమారం: సెల్‌ఫోన్ల వాడకం పెరగడంతో సైబర్ నేరస్తుల ఆగడాలు మితిమీరి పోయాయని వారితో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గట్ల సుధాకర్ ప్రజలను కోరారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి తన ఏటీఎం పిన్‌నెంబర్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలని, ఇతరులకు ఇవ్వొద్దని కోరారు. నగదు విత్ డ్రా చేసే సమయంలో నంబర్ ఇతరులకు కనపడనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సైబర్ నేరస్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు అడిగినా చెప్పొద్దని సూచించారు. మహిళలు లైంగిక వేధింపులకు గురైతే వెంటనే 100నంబర్ కాల్ చేసి వివరాలు తెలపాలని ఎస్సై మహిళలను కోరారు.

హైదరాబాద్ తరలిన నాయకులు

జైపూర్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆవిర్భావ సమావేశానికి జిల్లా పద్మశాలి సంఘం నాయకులు చిలువేరు సదానందం, సిరిపురం రవీందర్, జైపూర్ అధ్యక్షుడు వేముల మల్లేశ్ ఆధ్వర్యంలో పద్మశాలి కులబాంధవులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

జన్నారం: ఐకేపీ సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్‌ను వర్తింపజేస్తూ జీవోను విడుదల చేసినందుకు మండలంలోని సెర్ప్ ఉద్యోగులు ఆదివారం సీఎం చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఇబ్బందులు గుర్తుంచుకుని వేతనాలు సవరించి జీవో విడుదల చేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అధికారులు పట్టించుకుని వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం స్వీట్లు తినిపించుకుని క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రేఖానాయక్, మండల అధ్యక్ష కార్యదర్శులు రాజారాంరెడ్డి, జనార్దన్, వైస్ ఎంపీపీ వినయ్, ఏఎంసీ పద్మబుచ్చన్న, నాయకులు రియాజుద్దీన్, రమేష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మండలంలోని ఐకేపీ వీవోఏలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వేతనాలను పెంచాలని, సాధారణ ఆరోగ్య బీమాను అందించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వీవోఏలు లక్ష్మీనారాయణ, రమేష్, ప్రభాకర్, విజయ, శాంతకుమారి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు ఖరారు

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాల తేదీలు ఖరారయ్యాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రకటించారు. ఈ నెల 28వ తేదీన సింగరేణి బుధాగెస్ట్ హౌజ్‌లో బెల్లంపల్లి మండలం బుధాకుర్దు, చాకేపల్లి, చంద్రవెల్లి, బుధాకలాన్, లంబాడితండా, గురిజాల, మాల గురిజాల, దుగినేపల్లి, పెర్కపల్లి, బట్వాన్‌పల్లి గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు. 29న బెల్లంపల్లి కాల్‌టెక్స్ ప్రాంతంలోని వైష్ణవి ఫంక్షన్‌హాల్లో మున్సిపాలిటీలోని 7, 9, 11, 12, 13, 23, 24, 25, 26, 27వార్డుల పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులతో ఏప్రిల్ 1న బెల్లంపల్లి మున్సిపాలిటీలోని అగర్వాల్ భవన్‌లో 1, 2, 3, 4, 14, 15, 16, 17, 18, 28, 29, 30వార్డుల శ్రేణులతో, 2వ తేదీన నెన్నెల మండలం ఆవుడం గ్రామంలో, 4వ తేదీన తాండూర్ మండలం రేచినీ గ్రామంలో, 5వ తేదీన వేమనపల్లి మండల కేంద్రంలో, 6న తాండూర్ మండల కేంద్రంలో, 7న భీమిని మండల కేంద్రంలో, 9న కాసిపేట మండల కేంద్రంలో, 10న కన్నెపల్లి మండలం టేకులపల్లి ఫంక్షన్ హాల్లో, 11న పాత బెల్లంపల్లి గ్రామంలో, 12న నెన్నెల మండలం ఘన్‌పూర్ గ్రామంలో, 13న బెల్లంపల్లి మున్సిపాలిటీ పద్మశాలి భవన్‌లో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈజీఎస్ ఉద్యోగులకు పేస్కేల్ అమలుచేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

బెల్లంపల్లి: ఈజీఎస్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు వెంటనే పేస్కేల్‌ను అమలు చేయాలని ఆ శాఖ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉద్యోగులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఐకేపీ, ఈజీఎస్ శాఖలు ఒకే గొడుగు కిందకు పని చేస్తున్నాయని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ఉద్యోగులకు పేస్కేల్‌ను ప్రకటించి, ఈజీఎస్ ఉద్యోగులను విస్మరించడం సరికాదన్నారు. రెండు శాఖలను ఒకే అధికారి పర్యవేక్షణ చేస్తున్నారని అలాంటప్పుడు తమకు పేస్కేల్ వర్తింపజేయక పోవడం దారుణమన్నారు. తమ వేదనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పే స్కేల్ వర్తింప జేయడానికి ఎమ్మెల్యే చిన్నయ్య కృషి చేయాలని కోరారు.

క్రైస్తవుల మహాసభ పోస్టర్లు విడుదల

హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో వచ్చే నెల 12వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి సమావేశం పోస్టర్లను ఎమ్మెల్యే చిన్నయ్య ఆవిష్కరించారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన క్రైస్తవులు ఎమ్మెల్యే చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫిలోషిప్ ట్రస్ట్ ప్రతినిధులు మాథ్యూస్, ఎం.జార్జీ, పాస్టర్ అర్పన్, బ్రదర్ అనిల్, ఇతర పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

ధర మెరిసే.. రైతు మురిసే

- మిర్చి క్వింటాలుకు రూ.24వేలు
- నష్టాల నుంచి గట్టెక్కే అవకాశం


చెన్నూర్ గోదావరి పరీవాహక ప్రాంతంలోని చేలలో ఉన్న మిర్చి

చెన్నూర్: ఎర్ర బంగారం ధర ఈ ఏడాది మెరిసింది. వరంగల్, మహారాష్ట్రలోని నాగాపూర్ మార్కెట్‌లలో మిర్చి క్వింటాల్‌కు ధర రూ.24వేలు పలుకుతుంది. ఈ ఏడాది చీడపీడలు ఇబ్బందులు పెట్టినా దిగుబడి ఆశజనకంగా ఉంది. గత రెండేళ్ల నుంచి చీడపీడలతో దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. ఈ ఏడాది దిగుబడి బాగుండడంతో అప్పుల నుంచి గట్టెక్కే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సాగు...

జిల్లాలోని రైతులు 3750ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ఎకరానికి దిగుబడి 20నుంచి 25క్వింటాళ్ల చొప్పున 75నుంచి 80వేల క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎకరానికి 20 నుంచి 25క్వింటాళ్ల దిగుబడి రాగా కొన్ని మండలాల్లో 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి చేతికి వచ్చింది. ఈ లెక్కన చూస్తే 70వేల క్వింటాళ్ల పైబడి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు.

పెరిగిన ఖర్చులు..

ఈ ఏడాది మిర్చి సాగు ఖర్చు రెట్టింపైంది. విత్తనాలు వేసిన దగ్గర నుంచి మిర్చి ఏరివేత వరకు ఎకరానికి రూ.1.30లక్షల నుంచి రూ.1.50లక్షల ఖర్చు అయ్యిందని రైతులు నీలం శ్రీనివాస్, సంతోష్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో గల చేన్లలో వరద ముంపు చేరడంతో చీడపీడలు ఆశించి ఎకరానికి 15 నుంచి 18క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొన్నారు. ఎగువ ప్రాంత చేళల్లో ఎకరానికి 20 నుంచి 25 వరకు దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. పోయిన సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి ఆశించిన మేరకు రావడంతో సాగు ఖర్చులు పోను కొంత లాభం చేకూరిందని రైతులు అంటున్నారు.

ఈ ఏడాది బాగుంది



ఈ ఏడాది రూ.30లక్షలతో 20ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. రెండేళ్లు చీడపీడలతో నష్టాలు చవిచూశాం. ఈ ఏడాది చీడపీడలు ఆశించినా, దిగుబడి పర్వాలేదు. ఆశించిన ధర సైతం ఉండడంతో అప్పుల నుంచి బయటపడుతాం. వరంగల్ మార్కెట్‌లో క్వింటాళ్ మిర్చి రూ.24 వేలు పలుతుంది. ధర కొంచెం పెరిగితే రైతులకు మంచి లాభాలు వస్తాయి. మొన్న కురిసిన చెడగొట్టు వర్షాలకు మిర్చికి కొంత నష్టం కలిగింది. మొత్తంగా రెండేళ్ల నుంచి చూస్తే మిర్చి రైతులకు ఈ ఏడాది కొంత ఉపశమనం లభించింది.

- మానిశెట్టి శ్రీనివాస్, మిర్చి రైతు, చెన్నూర్

అటెన్షన్ ప్లీజ్..



కుక్కల స్వైర విహారం

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలోని చెన్నూర్, కోటపల్లి ప్రధాన రహదారి పక్కనే కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి: సతీష్, పంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్ : 9666023427

సాక్షి సినిమాలు



మంచిర్యాల
శ్రీనివాస : దాస్ కా ధమ్కీ
వెంకటేశ్వర : రంగమార్తాండ
జెమిని సినిమా స్క్రీన్ 1 : రంగమార్తాండ /బలగం
జెమిని సినిమా స్క్రీన్ 2 : దాస్ కా ధమ్కీ /కబ్జా
లక్సెట్టిపేట
మహానంద : బలగం
జన్నారం
రాఘవేంద్ర : బలగం
చెన్నూర్
శ్రీశ్రీనివాస : బలగం
బెల్లంపల్లి
రామకృష్ణ : దాస్ కా ధమ్కీ
బాలాజీ : బలగం
సీసీసీ
దేవి : దాస్ కా ధమ్కీ
తిరుమల : దాస్ కా ధమ్కీ

- మంచిర్యాలటౌన్

ప్రజావాణి వినేదెవరు?

- మొక్కుబడిగా 'గ్రీవెన్స్'
- మండలాల్లో నామమాత్రంగా నిర్వహణ

నెన్నెల: ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి మండల కేంద్రాల్లో ప్రజావాణిని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సుమారు 24శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వినతులు స్వీకరించాలి. కానీ మండలాల్లో సక్రమంగా జరగడం లేదు. అధికారులు ప్రజావాణికి హాజరుకావడం లేదు. దీంతో సమస్యలు చెప్పుదామని వచ్చిన వారికి నిరాశే ఎదురవుతోంది. అధికారుల కోసం గంటల కొద్ది వేచి చూసి వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గ్రామీణ ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. ప్రజావాణికి కొన్ని శాఖల అధికారులు హాజరుకావడం లేదు. కింది స్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులిపేసుకుంటున్నారు. దీనిపై గత సోమవారం ప్రజావాణిలో మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు ఆయా శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయి అధికారి విధిగా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులలో మాత్రం మార్పు రావడం లేదు. దీంతో వీరిపై మండల ప్రజలకు ఎలాంటి నమ్మకం లేక చాలా మంది బాధితులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసి వస్తున్నామని పలువురు బాధితులు 'సాక్షి'కి తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలిసినప్పటికీ ఎందుకు రావడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నేడు నిర్వహించే ప్రజావాణికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి విధిగా హాజరుకావాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.